## శబరిమలకు ప్రత్యేక రైళ్ల ఏర్పాటు

**సౌకర్యాలు అంతంత మాత్రమే**

**రైళ్లు ఏర్పాటు చేస్తున్నాం : ఎస్సీఆర్**

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలోని తెలంగాణ, ఏపీ తెలుగు రాష్ట్రాల నుంచి అయ్యప్ప భక్తుల కోసం ప్రత్యేక రైళ్ల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతుంది. ముఖ్యంగా సికింద్రాబాద్, కాచిగూడతో పాటు విజయవాడ, గుంటూరు, నర్సాపూర్, విశాఖపట్నం వంటి పలు రైల్వే స్టేషన్ల నుంచి కేరళ రాష్ట్రంలోని కొల్లం, కొట్టాయం వంటి రైల్వే స్టేషన్ల వరకు ప్రత్యేక రైళ్లు నడిపిస్తున్నారు. ఈ మేరకు ఈ నెలలో దాదాపు 150కి పైగా శబరిమల కోసం ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. అయితే శబరి ప్రత్యేక రైళ్ల ఏర్పాటు ప్రక్రియ వచ్చే నెలాఖరు వరకు ఉంటుందని రైల్వే అధికారులు తెలిపారు. ఇదిలా ఉంటే శబరిమల కోసం రైల్వే శాఖ ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక రైళ్లలో 30 శాతానికి పైగా అధిక చార్జీలు వసూలు చేస్తున్నారు కాని, వాటిని రెగ్యులర్ రైళ్ల మాదిరిగా సౌకర్యాలు లేవని, పైగా అపరిశుభ్రంగా ప్రత్యేక రైళ్లు ఉంటున్నట్లు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్లీన్ చేయడం లేదని, మరుగుదొడ్ల నిర్వహణ కూడా సరిగా లేదని, దాని వల్ల అయ్యప్ప భక్తులు ఇక్కట్లు ఎదుర్కొనే పరిస్థితులు ఉన్నాయని అంటున్నారు. దీనిపై దక్షిణ మధ్య రైల్వే అధికారులు స్పందించి తగిన నిర్ణయం తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.


# నమస్తే తెలంగాణ
# యాదాద్రి భువనగిరి

I | హైదరాబాద్, సోమవారం 16 డిసెంబర్ 2024 | YADADRI BHUVANAGIRI




భువనగిరి గురుకుల పాఠశాలలో ఉడుకుతున్న కూరను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

## విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

- కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి అర్బన్, డిసెంబర్ 15 : గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని కలెక్టర్ హనుమంతరావు సిబ్బందికి సూచించారు. పట్టణ పరిధిలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలను ఆదివారం కలెక్టర్ హనుమంతరావు ఆకస్మికంగా తనిఖీ చేయగా ఆ సమయంలో పాఠశాలలో ప్రిన్సిపాల్ జగదీశ్వర్‌రెడ్డి లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ ఎక్కడికైనా వెళ్లదల్చుకుంటే ముందస్తు అనుమతి తీసుకోవాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం 8వ తరగతి విద్యార్థులకు కలెక్టర్ గణితం బోధించి, అర్థం కాని ప్రాబ్లెమ్స్‌ను బోర్డుపై వివరించారు. అనంతరం వంటగదిలో బియ్యం, పప్పు, పాలు, పెరుగు, కూరగాయలు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. వండిన భోజనాన్ని, వండుతున్న కూరలు, ఉడకబెట్టిన గుడ్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఏరోజుకారోజు కూరగాయలు, గుడ్లను మెనూ ప్రకారం అందించాలని సూచించారు. విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఆయన వెంట జిల్లా యువజన క్రీడశాఖ అధికారి ధనుంజయనేయులు ఉన్నారు.

# పండుగల కానుకకు పాతర..!

**పేదలకు ఇచ్చే గిఫ్ట్‌లకు కాంగ్రెస్ మంగళం**

- ఇప్పటికే ముస్లింల రంజాన్ తోఫా కట్
- దసరాకు ఆడ బిడ్డల బతుకమ్మ చీరెలు బంద్
- తాజాగా క్రిస్మస్ కానుకలకు కత్తెర
- మాజీ సీఎం కేసీఆర్‌కు పేరొస్తుందనేనా..?
- రేవంత్ రెడ్డి సర్కార్‌పై పేదల ఆగ్రహం

యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ పండుగలకు ఆయా వర్గాలకు ఇచ్చే కానుకలకు కాంగ్రెస్ సర్కార్ పాతరేసింది. కొత్తగా పేదలకు ప్రోత్సాహకాలు ఏమీ ఇవ్వకపోగా.. ఏటా అందజేస్తున్న కానుకలకు మంగళం పాడింది. ఈ ఏడాది క్రిస్మస్ కానుకలు ఇచ్చేది లేదని తేల్చి చెప్పింది. ఇప్పటికే రంజాన్ తోఫా, బతుకమ్మ చీరెల పంపిణీకి స్వస్తి పలికింది. దీంతో ఆయా వర్గాల ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడుతున్నారు.

### రంజాన్‌తోఫా కట్..

తెలంగాణ ఏర్పాటు తర్వాత నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని పండుగలకు సమాన ప్రాధాన్యం ఇచ్చారు. ఇందులో భాగంగా రంజాన్ పర్వదినం పురస్కరించుకొని అర్హులందరికీ రంజాన్ తోఫా అందించారు. చీరె, జాకెట్, పంజాబీ డ్రెస్ మెటీరియల్, లాల్చి, పైజామా మెటీరియల్‌తో కూడిన కానుకల కిట్‌ను పవిత్రమైన పండుగ సందర్భంగా ఇచ్చేవారు. గిఫ్ట్ ముందుగానే జిల్లాలకు వచ్చేవి. వాటిని నియోజకవర్గాలు, మండల కేంద్రాలకు తరలించేవారు. రంజాన్ ముందు దినాల్లోనే కానుకలు పంపిణీ చేసేవారు. ఇందు కోసం ప్రజాప్రతినిధులు, అధికారులతో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసేవారు. గతేడాది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 19,500మందికి కానుకులను అందించారు. అందులో యాదాద్రి భువనగిరి జిల్లాలో 2,500, నల్లగొండలో 10,500, సూర్యాపేటలో 6,500 తోఫాలు ఉన్నాయి. కానీ ఈ ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సారి కానుకల పంపిణీపై కార్యాచరణ రూపొందించ లేదు. ఏకంగా రంజాన్ తోఫాను బంద్ చేసింది.

### కేసీఆర్‌కు పేరొస్తుందననేనా..?

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాలకు సమానంగా చూశారు. అన్ని మతాల సంక్షేమాన్ని కాంక్షించారు. ఆయా పండుగలకు కానుకలు ఇస్తూ వచ్చారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి సర్కార్ వాటిని నిలిపేసింది. కేసీఆర్ తీసుకొచ్చిన కార్యక్రమాలు కావడంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, అందుకే అమలు చేయడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. రాజకీయం కోసం పేదలకు పంపిణీ చేయాల్సిన వాటిని బంద్ చేయడంతో ఆయా వర్గాల నిరుపేదలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





రంజాన్ తోఫా

బతుకమ్మ చీరలు

క్రిస్మస్ గిఫ్టులు

### బతుకమ్మ చీరెలు బంద్..

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను నాటి బీఆర్ఎస్ సర్కారు గౌరవించింది. స్వరాష్ట్రంలో బతుకమ్మ పండుగను గుర్తించి వైభవంగా నిర్వహించింది. పండుగకు కానుకగా 18 ఏండ్లు నిండిన పేద మహిళలకు 2017 నుంచి ఏటా బతుకమ్మ చీరెలను పంపిణీ చేసింది. రకరకాల రంగులు, 250 డిజైన్లతో నాణ్యత గల చీరెలను అందించింది. గతేడాది జిల్లాలో 2.50లక్షల చీరెలను పంపిణీ చేసింది. నాడు బతుకమ్మ చీరెల పంపిణీ పండుగలా సాగేది. ఉచిత చీరెలతో బతుకమ్మ పండుగను సంబురంగా జరుపుకొనేవారు. కానీ చీరెల పంపిణీ పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం తూట్లు పొడిచింది. అధికారంలోకి వచ్చిన తొలి సంవత్సరం నుంచే అటకెక్కించింది.

### తాజాగా క్రిస్మస్ కానుకలు..!

ఇప్పటికే కాంగ్రెస్ సర్కార్ రంజాన్ తోఫా, బతుకమ్మ చీరెల పంపిణీని నిలిపేయగా.. ఇప్పుడు క్రిస్మస్ కానుక వంతు వచ్చింది. జిల్లాలో ఇప్పటికే క్రిస్మస్ కానుకలను పంపిణీ చేయాల్సి ఉంది. గతంలో ఇదే సమయానికి పేద క్రిస్టియన్లకు గిఫ్ట్‌లు అందేవి. గిఫ్ట్ ప్యాకుల్లో ఒక చీరె, పంజాబీ డ్రెస్, ప్యాంట్, షర్టు ఉండేవి. కుటుంబంలోని తల్లిదండ్రులకు, కుమార్తెకు దుస్తులు ఇచ్చేవారు. జిల్లాలో ఏటా 2వేల కానుకలు పంపిణీ చేసేవారు. ఆయా నియోజకవర్గంలోని ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ చేసేవారు. కానీ ఈ సంవత్సరం ఇప్పటి వరకు గిఫ్ట్‌లు పత్తాలేవు. అధికారులు మాత్రం తమకు ఎలాంటి ఆదేశాలు లేవని స్పష్టం చేస్తున్నారు. దీంతో క్రిస్మస్ కానుకలకు కూడా మంగళం పాడినట్లయింది.

### మార్పు అంటే ఇదేనా..?

నాడు కేసీఆర్ సర్కార్ పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను అమలు చేసింది. రంజాన్ తోఫాతో పేద ముస్లింలు ఎంతో సంబురంగా పండుగ జరుపుకునేవారు. తెలంగాణ ఆత్మగౌరవం బతుకమ్మ పండుగకు మహిళకు చీరెలు ఇచ్చేది. దీని వల్ల నేతన్నలకు ఉపాధి కూడా లభించేది. బతుకమ్మ చీరెలను కూడా ఈసారి సర్కారు అదించ లేదు. పండుగ దగ్గరికొచ్చిన ఇంకా క్రిస్మస్ కానుకల ఊసే లేదు. పేదలకు ఉపయోగపడే కార్యక్రమాలను కొనసాగించాల్సింది పోయి.. బంద్ చేయడం ఏంటి..? ఇదేనా మార్పు అంటే.. కాంగ్రెస్ పార్టీని ప్రజలు క్షమించరు.



*-కంచర్ల రామకృష్ణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు*



భువనగిరిలోని నవ భారత్ డిగ్రీ కళాశాలలో పరీక్ష రాసి బయటకు వస్తున్న గ్రూప్ 2 అభ్యర్థులు

## తొలి రోజు సజావుగా గ్రూప్-2 పరీక్షలు

**పరీక్షలకు సగం మందే హాజరు**

- జిల్లాలో 6078 మంది అభ్యర్థులకు 2,971 మంది హాజరు
- అభ్యర్థులతో కిక్కిరిసిన ఆర్టీసీ బస్టాండ్లు

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 15 : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆది, సోమవారం నిర్వహించే గ్రూప్-2 పరీక్షలు తొలిరోజు జిల్లా వ్యాప్తంగా సజావుగా జరిగాయి. పేపర్ -1 ఉదయం 10 గంటలకు, పేపర్ -2 మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కాగా, కొన్ని పరీక్ష కేంద్రాల వద్దకు పరీక్ష సమయానికి వచ్చి అభ్యర్థులు లోపలికి పరుగులు తీశారు. ఉదయం హాజరుశాతం అధికంగా ఉన్నప్పటికీ మధ్యాహ్నం జరిగిన పరీక్షకు కొంత మేర తగ్గింది. జిల్లాలో మొత్తం 6,078 మంది అభ్యర్థులకుగానూ ఉదయం పేపర్-1 పరీక్షకు 2,971మంది హాజరు కాగా, 3,107 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పేపర్-2 పరీక్షకు 6,078 అభ్యర్థులకుగానూ 2,961 హాజరు కాగా, 3,117 మంది గైర్హాజరయ్యారు.

### పరీక్ష కేంద్రాల వద్ద సందడి

పరీక్షలకు వివిధ ప్రాంతాల నుంచి అభ్యర్థులు తెల్లవారు జాము నుంచే వచ్చారు. అన్ని ప్రాంతాల నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు అభ్యర్థులు, వారి వెంట వచ్చే వారితో కిక్కిరిసి వచ్చాయి. దాంతో బస్టాండ్లు కిటకిటలాడాయి. ఉదయం 10గంటలకు పరీక్ష ప్రారంభం కాగా 9:30 గంటలకే కేంద్రాల గేట్లను మూసివేశారు. కొంత మంది అభ్యర్థులు ముందుగానే కేంద్రాలకు రాగా, మరి కొంతమంది సమయానికి వచ్చి పరుగులు తీశారు. పరీక్షలు రాసిన తర్వాత అభ్యర్థులు ఆయా పరీక్ష కేంద్రాల వద్ద ఒక్కసారిగా రోడ్లపైకి రావడంతో పలుచోట్ల ట్రాఫిక్ స్తంభించింది.

### చంటి పిల్లలతో వచ్చిన అభ్యర్థులు

పరీక్ష కేంద్రాలకు కొంత మంది అభ్యర్థులు చంటి పిల్లలతో వచ్చారు. వీరిని ఆడించేందుకు అమ్మమ్మలు, నాయనమ్మలు, తాతయ్యలు, వారి భర్తలు వచ్చారు. తల్లి పరీక్ష కేంద్రంలోకి వెళ్తే పిల్లలను ఆడిస్తూ ఉన్న సంఘటనలు దర్శనమిచ్చాయి.

### పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

పలు పరీక్ష కేంద్రాలను కలెక్టర్ కలెక్టర్ హనుమనంతరావు తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరు, అభ్యర్థుల హాజరుశాతం, బయోమెట్రిక్ విధానం తదితర అంశాలను నిశితంగా పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.

# చలి @12 డిగ్రీలు

- రోజురోజుకూ పెరిగిపోతున్న చలి తీవ్రత
- భారీగా పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు
- గుండాలలో 12.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



యాదగిరిగుట్టలో చలిమంట కాచుకుంటున్న యువకులు

యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : చలి పంజా విసురుతున్నది. జిల్లాలో రోజు రోజుకు తీవ్ర రూపం దాల్చుతున్నది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ప్రజలను గజగజ వణికిస్తున్నది. వాతావరణంలో అనూహ్య మార్పులతో చలి తీవ్రత మరింత పెరిగింది. రాత్రిపూట ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. సాధారణం కంటే మూడు నుంచి నాలుగు డిగ్రీల మేర తక్కువగా నమోదవుతున్నాయి.

కొన్ని ప్రాంతాల్లో ఉదయం 8, 9 గంటల వరకు మంచు దట్టంగా కమ్ముకుంటున్నది. తెల్లవారు జామున తప్పనిసరి బయటకు వెళ్లే పాల వ్యాపారులు, కూరగాయల రైతులు, కార్మికులు, కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం 5నుంచి 6గంటల తర్వాత ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతుండటం, చలి గాలులు వీస్తుండటంతో జనం ఇండ్లకే పరిమితమవుతున్నారు.

జిల్లాలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే.. గుండాలలో 12.2 డిగ్రీలు, పోచంపల్లిలో 12.7, చౌటుప్పల్ మండలంలోని తుప్రాన్ పేట్‌లో 13, బొమ్మలరామారం మండలంలోని మర్యాలలో 13.1, మోటకొండూరులో 13. 7, వలిగొండ, రాజాపేట, ఆత్మకూర్ (ఎం)లలో 13.8 డిగ్రీల చొప్పున కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలి తీవ్రత మరింత పెరిగే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.



కలెక్టర్ కార్యాలయం వద్ద సమ్మెలో పాల్గొన్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

## సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

- సమగ్ర శిక్షాఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పాండరి

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 15 : సమగ్ర శిక్షా ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మంగ పాండరి అన్నారు. కలెక్టర్ కార్యాలయం వద్ద సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె ఆదివారం 6వ రోజూ కొనసాగింది. ఉద్యోగులు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి లడ్డూతో నిరసన తెలిపారు. సమగ్ర శిక్షా ఉద్యోగులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని కోరారు.

ఈ సందర్భంగా పాండరి మాట్లాడుతూ సమగ్ర శిక్షా ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలన్నారు. కనీస సౌకర్యాలు, ఉద్యోగ భద్రత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆయా మండలాల సమగ్ర శిక్షా ఉద్యోగులు పాల్గొన్నారు.

## సీఐ ట్రాప్ వ్యవహారంపై విచారణ వేగవంతం



- డీఎస్పీతో విచారణ చేయిస్తున్న ఎస్పీ శరత్ చంద్ర పవార్
- సదరు మహిళతో నాలుగు నెలలుగా సీఐ ప్రేమాయణం
- భర్త నుంచి విడాకులు ఇప్పించి తనతో సహజీవనం చేసే ప్లాన్
- భార్యతో పలు కేసులు పెట్టించి వేధిస్తున్నట్లు బాధితుడి ఆవేదన
- ఆమెకు హైదరాబాద్‌లో ఇల్లు కొనిస్తానని వాట్సాప్‌లో చాట్
- ప్రాణహాని ఉందని ఎస్పీకి బాధితుడి ఫిర్యాదుతో విషయం బయటకు..

నల్లగొండ, డిసెంబర్ 15 : ఓ మహిళపై కన్నేసి ఓ పచ్చటి సంసారంలో నిప్పులు పోశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐ డానియల్‌పై ఎస్పీ శరత్ చంద్ర పవార్ విచారణ వేగవంతం చేశారు. డీఎస్పీతో ఈ కేసుకు సంబంధించిన వ్యవహారం విచారణ చేసి నివేదించాలని ఆదేశించిన నేపథ్యంలో సదరు డీఎస్పీ నేడో రేపో నివేదిక అందజేసే పనిలో నిమగ్నమయ్యారు. భార్యాభర్తల మధ్య వచ్చిన ఆస్తి తగాదాలో నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన సీఐ డానియల్ జోక్యం చేసుకొని ఆమెను ట్రాప్ చేశారని, దీంతో తన భార్య మధ్య గొడవ కాస్త ఎక్కువై విడిపోయే పరిస్థితి వచ్చిందని, తన భార్యతో విడాకులు ఇప్పించి ఆమెతో సీఐ సహజీవనం చేసేందుకు ప్లాన్ చేస్తున్నాడని సదరు మహిళ భర్త ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో నాలుగు నెలలుగా జరుగుతున్న వ్యవహారం బయటకు వచ్చింది.

### అసలేమైందంటే?

జిల్లా కేంద్రంలో నివసించే ఒక మొబైల్ షాప్ యజమాని పదేండ్ల కింద ఒక మహిళను ప్రేమించి పెండ్లి చేసుకున్నాడు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. రెండేండ్ల కింద సదరు వ్యక్తి తన ఇంటి వద్ద ఉన్న వ్యవసాయ భూమి అమ్మి పట్టణంలోని ఒక కాలనీలో కొంత లోన్‌తో ఇల్లు కొని తన భార్య పేరుమీద రిజిస్ట్రేషన్ చేశాడు. ఇటీవల ఈఎమ్ఐలు కట్టలేక దాన్ని అమ్ముదామని భార్య అనుమతి తీసుకొని అమ్మకానికి పెట్టి అడ్వాన్స్ కూడా తీసుకున్నాడు. ఫైనల్ అమౌంట్ చెల్లించే సమయంలో ఉన్నట్టుండి భార్య మాట మార్చింది. తన భర్త వేధిస్తున్నాడని, తనకు ఇష్టం లేకుండా ఇల్లు అమ్ముతున్నాడని తదితర కారణాలతో టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టినట్లు బాధితుడు తెలిపాడు. ఈ విషయంలో సంబంధిత స్టేషన్ సీఐ సదరు బాధితుడిని బెదిరించి ఆ ఇల్లుకు అడ్వాన్స్‌గా తీసుకున్న డబ్బు కొన్న వాళ్లకు చెల్లించాలని బెదిరించినట్లు బాధితుడు ఎస్పీకి రాసిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇంటి వద్ద తన పేరిట ఉన్న భూమి అమ్మి వారికి డబ్బు చెల్లించాలని, ఆ ఇల్లు ఆమె(బాధితుడి భార్య)పేరు మీదనే ఉండాలని సీఐ ఆదేశించాడని తెలిపాడు.

### చాటింగ్‌తో బయటపడ్డ సీఐ వ్యవహారం

ఈ వ్యవహారంలో భార్యాభర్తల మధ్య గొడవలు రావడంతో భార్య జిల్లా కేంద్రంలోనే తన చిన్నమ్మ (తన తండ్రి రెండో భార్య) దగ్గర ఉంటుంది. సీఐ ఇంత స్థాయిలో బెదిరిస్తున్న నేపథ్యంలో బాధితుడు ఈ నెల 9వ తేదీన నేరుగా వారి ఇంటికి వెళ్లి ఫోన్ చెక్ చేయడంతో సీఐతో తన భార్య చేసిన చాట్స్ బయట పడ్డాయి. అందులో సదరు సీఐని 'నా కోసం ప్లాట్ కొన్నావా అంటే ఆయన ప్రాసెస్‌లో ఉన్నానని అనటంతోపాటు నేను నీ హస్బండ్ లాగానే.. నీకు ఏం కావాలి' అనే కోణంలో చాట్స్ ఉండటంతో ఆ ఫోన్ తీసుకొని వెళ్లి ఎస్పీకి ఫిర్యాదు చేసి మొబైల్ చూపించడంతో విషయం బయటపడింది. సదరు సీఐ బాధితుడితో భార్యకు విడాకులు ఇచ్చేసి ఆమెతో సహజీవనం చేయాలనే ఆలోచనతో ఉన్నాడని, అందులో భాగమే తనను ఇబ్బంది పెట్టి విడాకులు ఇప్పించాలనే కుట్ర జరుగుతుందనేది ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు.

### నాలుగు నెలలుగా ప్రేమాయణం

సదరు మహిళకు, సీఐకి నాలుగు నెలలుగా ఈ ప్రేమాయణం సాగుతున్నట్లు బాధితుడు ఆవేదనతో తెలిపాడు. తన భార్య చిన్నమ్మ పంచాయితీ విషయంలో సదరు సీఐతో పరిచయం ఏర్పడి అప్పడి నుంచి వారు తరచుగా ఫోన్లు మాట్లాడుకుంటున్నారని, దీన్ని తాను పెద్దగా పట్టించుకోకపోవడం వల్ల తన కుటుంబమే విచ్ఛిన్నమయ్యే పరిస్థితి నెలకొన్నదని ఆవేదనతో చెప్పాడు. తన కొడుకు ప్రస్తుతం హాస్టల్‌లో ఉంటే కూతురు మాత్రం తనతోనే ఉన్నదని అన్నాడు. దీనిపై చేపట్టిన విచారణ వేగంగా జరుగుతున్నట్లు ఎస్పీ శరత్ చంద్ర తెలుపగా, వారి నుంచి తనకు ప్రాణహాని ఉందని బాధితుడు ఎస్పీకి విన్నవించాడు.

# యాసంగికి కాళేశ్వరం జలాలు వచ్చేనా..?

- ఇంకా ఖరారు కాని నీటి విడుదల షెడ్యూల్
- బీఆర్ఎస్ హయాంలో నిరంతరాయంగా రాగా.. నేడు ప్రశ్నార్థకంగా?
- గత యాసంగిలో పొలాలను ఎండబెట్టిన కాంగ్రెస్ సర్కార్

సూర్యాపేట, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : ఈ యాసంగికి కాళేశ్వరం జలాలు వచ్చేనా, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చేనా అని రైతులు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డిసెంబర్ తొలి వారంలోనే నీటి విడుదలపై షెడ్యూల్ ఖరారయ్యేది. షెడ్యూల్ ప్రకారమే కాకుండా పంట చేతికి వచ్చేంత వరకు, రైతులు నీటి విడుదల నిలిపివేయాలని కోరేంత వరకు విడుదల చేశారు. ఈ సారి ఇప్పటికీ నీటి విడుదల షెడ్యూల్ ఖరారు కాకపోవడం పట్ల జలాలు వస్తాయా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నీటి నిర్వహణ లోపంతో పంటలు ఎండబెట్టగా ఈ సారి పరిస్థితి ఎలా ఉంటోందోనని రైతులు అయోమయానికి గురవుతున్నారు.

స్వరాష్ట్రంలో గత పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో అన్ని రంగాలతోపాటు రైతన్న బలపడ్డాడు. దశాబ్దాల తరబడి నీటి చుక్కకు నోచుకోని పంట భూములకు ముఖ్యమంత్రి కేసీఆర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా పూర్తి చేసిన కాళేశ్వరం ప్రాజెక్టుతో గోదావరి జలాలు తీసుకొచ్చి సస్యశ్యామలం చేశారు. ప్రధానంగా సూర్యాపేట జిల్లా పరిధిలోని 2.95 లక్షల ఎకరాల శ్రీరాంసాగర్ ఆయకట్టు పరిధిలోని రైతులకు గత ఉమ్మడి రాష్ట్రంలో పీడకలగా ఉండగా కాళేశ్వరం జలాలు రావడంతో తలెత్తుకొని ధైర్యంగా సంతోషంగా జీవనం సాగించారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ గతేడాది కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వచ్చిన తొలి యాసంగికి కాళేశ్వరం జలాలు రాకపోవడంతో వరి పంట ఎండిపోయింది. దీంతో దాదాపు పదేండ్ల తరువాత ప్రభుత్వంపై రైతన్నలు ఆందోళనలు, ప్రతిపక్షాల నిరసనలు పునరావృతం అయ్యాయి. ఇప్పుడిప్పుడే రైతన్నలు వానకాలం పూర్తి చేసుకొని యాసంగి కోసం దుక్కులు దున్నుతుండగా నీళ్లు వస్తాయా లేదోనని ఎదురుచూస్తున్నారు.



అర్వపల్లి పరిధిలో ఎస్సారెస్పీ కాల్వ (ఫైల్)

### నీటి విడుదల షెడ్యూల్ కోసం ఎదురుచూపు

ఈ యాసంగికి శ్రీరాంసాగర్ ఫేజ్ 2 ఆయకట్టు పరిధిలోని సూర్యాపేట జిల్లాకు కాళేశ్వరం జలాలు ఇచ్చేందుకు ఇప్పటి వరకు షెడ్యూల్ ఖరారు కాకపోవడం పట్ల రైతులు అయోమయంలో ఉన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో యాసంగికి డిసెంబర్ తొలి వారంలోనే షెడ్యూల్ విడుదల చేసి గోదావరి జలాలను నిరంతరాయంగా విడుదల చేసేది. దాదాపు మూడు నెలలు అంటే 85 నుంచి వంద రోజులపాటు సీజన్‌కు 30 నుంచి 40 టీఎంసీల చొప్పున నీటిని విడుదల చేయగా జిల్లాలోని 2.95లక్షల ఎకరాల్లో వరి పంట పండింది. ప్రస్తుతం వానకాలం సీజన్ పూర్తవుతుండగా యాసంగి కోసం ఇప్పుడిప్పుడే రైతులు దుక్కులు దున్నుతున్నారు. గత యాసంగి సీజన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహణ లోపమో లేక కావాలని చేసిందో కానీ కాళేశ్వరం నుంచి నీటిని విడుదల చేయకపోవడంతో జిల్లాలో వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. దీంతో ఈ యాసంగికి కాళేశ్వరం జలాలు వస్తాయా రావా అనే రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఒక వేళ నీటిని విడుదల చేయదల్చుకుంటే షెడ్యూల్ విడుదల చేయాలని లేని పక్షంలో నీటి విడుదల ఉండదని ప్రకటించాలని రైతులు కోరుతున్నారు.

### పంటకు నీళ్లు అందక గతేడాది నష్టపోయాం



గతేడాది యాసంగిలో 3.15ఎకరాల్లో వరి సాగు చేసిన. సకాలంలో కాళేశ్వరం నీళ్లు అందించకపోవడంతో పంట మొత్తం ఎండిపోయి తీవ్రంగా నష్టపోయాం. ఈ సారైనా అధికారులు స్పందించి సకాలంలో నీళ్లు అందించాలి.

*– లకావత్ వెంకన్న, సూర్యనాయక్‌తండా , తుంగతుర్తి*

### సాగుకు కాళ్వేశ్వరం జలాలు అందించాలి



ఎస్సారెస్పీ కాల్వ నీళ్లపై ఆధారపడి వ్యవసాయ సాగు చేస్తున్నా. గతేడాది ఎస్సారెస్పీ నీళ్లు సకాలంలో రాలేదు. నాలుగు ఎకరాలు ఎండిపోయి పశువులకు మేత పాలైంది. రైతులకు ఇబ్బంది లేకుండా ముందస్తుగానే నీళ్లను అందించాలి.

*– చింతకుంట్ల ముత్తయ్య, రావులపల్లి, తుంగతుర్తి*